

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

# ఫేస్‌బుక్

**ప్రొద్దుటే పనిలో ఉంటే సుశీల ఫోన్ చేసింది.**

"మా ఇంట్లో ఇవాళ బొమ్మల కొలువు. నువ్వు రావాలి" అంది.

"నేను లలిత దగ్గరకి వెళుతున్నాను. ఏదో అర్జెంట్ పని ఉందిట" అని నోటికొచ్చిన అబద్ధం చెప్పాను. రాయాల్సిన స్క్రిప్టులు గుర్తొచ్చి ఆపద్ధర్మంగా అబద్ధాలు ఆడ్తుంటాను.

"లలిత రాజమండ్రి వెళ్ళింది రాత్రి" అంది సుశీల.

నేను గతుక్కుమని "ఎలా తెలుసు? ఫోన్ చేసావా?" అన్నాను.

"ఫేస్‌బుక్‌లో పెట్టిందిగా!" అంది సుశీల.

అవును. నేనూ చూసాను. ఇలా ప్రతి మూమెంటూ ఫేస్‌బుక్‌లో పెట్టాలా నా ఖర్మకి? అని విసుక్కున్నాను. కానీ ప్రొద్దుటే "పనిమనిషి రాలేదు. ఆదివారం నాకు డబల్ డ్యూటీ" అని నేను పెట్టిన స్టేటస్ గుర్తొచ్చి విసుగుని మింగేసాను.

"మా కుక్క రాత్రి నుండీ వాంతులు చేసుకుంటోంది" అనిఒక అమ్మాయి స్టేటస్ పెడితే, డెబ్బై నాలుగుమంది లైకులు కొట్టారు. ముప్ఫై ఆరుమంది చిట్కా వైద్యాలు చెపుతూ, "సో శాడ్" అని విచారం ప్రకటించారు. పక్కనే "మై ఫాదర్ ఇన్‌లా ఎక్స్‌పైర్డ్" అని ఎవరో పెడితే, లైకులు తొంభైమంది పెట్టి "ఎంజాయ్ బాస్!" అని కామెంట్స్ పెట్టారు.

మా పిల్లలిద్దరూ మొదట్లో నా ఫేస్‌బుక్‌లో ఉండేవారు. ఒకనాడు చిన్నవాడు చడీ చప్పుడూ లేకుండా నన్ను తీసేసాడు. పెద్దవాడు మాత్రం ఒక రోజు నేను వాడి ఫ్రెండుకి మెసేజ్ పెట్టడం వల్ల యుద్ధం ప్రకటించి తీసేసాడు.

"హాయ్ చందనా.. హౌఎబౌట్ మీటింగ్ టుడే?" అని వాడు పెట్టాడుట. నాకు మధ్యాహ్నం పనయ్యాక ఫేస్‌బుక్‌లోకి వెళ్ళి, చందనని ఇంటికి రమ్మంటున్నాడు అనుకుని "ఔను.. నేనూ ఇంట్లోనే ఉన్నాను. రా" అని పెట్టాను.

ఇది చూసి వాడు ఆఫీస్ నుండి ఫోన్ చేసి నా మీద మండిపడ్డాడు. నా తప్పేంటో నాకు అర్థం కాలేదు. "ఏం చేసా్నా?" అంటే, "కొడుకు లైన్ వేస్తుంటే, తల్లి సపోర్ట్ చేస్తోంది అనుకోదూ? అసలు నువ్వు నా ఫేస్‌బుక్‌లో ఉండకు.. నా ఫ్రెండ్స్‌ని కూడా తీసెయ్" అన్నాడు.

నేను వాడిని మాత్రం తీసేసాను. దాంతో నేను ఏం పెడుతున్నానో తెలీక తన్నుకుంటున్నాడు.

తిరుపతిలో వాడి చిన్నప్పుడు తలనీలాలు తీసి పంగనామాలు పెట్టించి, ముద్దుగా వాళ్ళ నాన్న మెడ మీద ఎత్తుకున్న ఫోటో నేను ఫేస్‌బుక్‌లో పెడితే, వాడి గర్ల్ ఫ్రెండ్స్ అంతా చూసి "చో...స్వీట్, హౌ క్యూట్" అని కామెంట్స్ పెట్టి. ఆ విషయం వాడికి చెపితే, పర్మిషన్ పెట్టి ఇంటికి పరిగెత్తుకొచ్చాడు.

"మమ్మీ... నా చిన్నప్పటి నేకెడ్ ఫోటోస్ కూడా పెట్టావా?" అని అరిచాడు.

"అవునా లంగోటీలో ఉన్న ఫోటోలూ, అన్నప్రాసనవీ, అరిశలు మీద నడిచినవీ.." అని చెపుతుంటే, తల కొట్టుకుని "అసలు నా చిన్నప్పటి ఫోటోలు రివీల్ చెయ్యకూడదు, నేను అలా ఒకప్పుడు ఉన్నానని వాళ్ళకి తెలీకూడదు!" అన్నాడు.

"అదేంట్రా? నువ్వు ఇలాగే ఆరు అడుగులు పుట్టావని వాళ్ళు అనుకుంటారా?" అన్నాను.

"అయ్యో.. నీకు అర్థం కాదు! అసలు మీ పేరెంట్స్‌కి ఎందుకు ఈ ఫేస్ బుక్కులు?" అని అరిచాడు.

"ఆ శ్రీనాథ్ గాడి మదర్ కూడా వాడి పరువు తీసింది" అన్నాడు.

"ఆవిడేం చేసింది?" అని అడిగాను.

"ప్రొఫైల్‌లో.. ఇంటరెస్టెడ్ ఇన్ మెన్, విమెన్ అనే ఆప్షన్స్ ఉంటే, ఛీ మెన్ అని ఎలా రాయనూ? అనుకుని ఇంట్రెస్టెడ్ ఇన్ విమెన్ అని పెట్టింది. దాంతో అంతా వాడికి ఫోన్లు చేసి ఒకటే నవ్వు. వాడెళ్ళి "అమ్మా.. దాని మీనింగ్ వేరే" అని చెప్తే ఆవిడకి అర్థం కాదు! ఇంత వయసొచ్చి ఇప్పుడు 'ఇంట్రెస్టెడ్ ఇన్ మెన్' అని పెట్టాలా? నా గురించి మీ నాన్నగారేం అనుకుంటారూ? అంటుంది" అని మావాడు కామన్‌గా పేరెంట్స్ అంతా కలిసి ఈ ఫేస్‌బుక్స్ ద్వారా పిల్లల్ని ఎలా ఎంబరాస్ చేస్తున్నారో చెప్పి వాపోయాడు.

మొన్న మా ఫ్యామిలీ డాక్టర్ గారు ఫేస్‌బుక్‌లో "క్రిష్ ఎలా ఉన్నాడు.. చిన్నప్పుడు ఎప్పుడూ మోషన్స్. మీరు చాలా అవస్త పడేవారు" అని పెడితే

"అవును డాక్టరుగారూ మీరు ఎన్నోసార్లు క్లీన్ చెయ్యడంలో హెల్ప్ చేసారు. థాంక్స్" అని నేను పెట్టాను.

దాంతో క్రిష్ణ గర్ల్ ఫ్రెండ్ అలిగి వాడికి ఈ విషయం లీక్ చేసింది. ఇంక ఫ్యామిలీ మెంబర్ల మధ్య కొన్నిసార్లు యుద్ధాలే జరిగిపోతున్నాయి.

"నువ్వు పెట్టిన శారీ చాలా బావుంది. నియర్లీ ఫోర్ థౌజండ్ ఉంటుంది. అంత కాస్ట్లీది ఎందుకు పెట్టావు?" అని నీరజ తన తోటి కోడలి చెల్లెలికి కామెంట్ పెట్టింది.

ఇది చూసిన నీరజ తోటికోడలు, తన చెల్లెలు తనకి ఆరువందల చీరపెట్టి, తన తోటికోడలికి నాలుగు వేల చీర పెట్టినందుకు అలిగి, ఆరునెలలు మాట్లాడలేదుట. ఈ విషయం మొహం మీద చెప్పకుండా ఇంకో ఫ్రెండ్‌కి ఫేస్‌బుక్‌లో చెప్పుకుని "అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం. స్వంత చెల్లెళ్ళ మీద మమకారం ఒక అంధకారం" అని పెట్టింది. కానీ ఆ చెల్లికి తన గురించే అని అర్థం కాక 'లైక్' కొట్టింది.

ఒక పెద్దమనిషి నేను ఫేస్ బుక్‌లో ఏ ఫోటో పెట్టినా "నీ పక్కనున్న వాళ్ళు ఎవరు?" అని ఫోన్ చేసి అడుగుతాడు. నేను ఎవరి స్టాటస్‌కి లైక్ పెట్టినా "అందులో నీకు ఏం నచ్చిందిటా? నీకు అస్సలు బుర్రలేదు" అని సుత్తి వేస్తాడు. అసలు ఆయన స్వయంగా ఏ స్టాటస్ పెట్టడు. నేను పెట్టగానే కామెంట్ చెయ్యడానికి రెడీగా ఉంటాడు. "నువ్వు పచ్చ చీర కట్టుకున్న ఫోటోలో మేకప్ వేసుకున్నావు

కదూ?" అంటాడు. నేను ఉక్కిరి బిక్కిరయ్యే పనిలో ఉండి "ఏమో" అంటాను. "నీ ఫోటోల్లో 144వ నెంబర్ ఫోటో, నేను లైన్‌లో ఉంటా. ఇప్పుడు చూసి చెప్పు" అంటాడు. ఇలాంటి వాళ్ళ కోసమే బ్లాక్ చేసే ఫెసిలిటీ కల్పించింది ఫేస్‌బుక్.

ఇంకో పక్క ఆంధ్రా తెలంగాణా గొడవలు అయిపోతుంటాయి. మరో పక్క అభిమాన హీరోల గురించి ఘర్షణలు అయిపోతుంటాయి.

మా మేనల్లుడి పెళ్ళాం వాడి ఎకౌంట్‌లోకి వెళ్ళి, తన ఫోటోలన్నింటికీ 'సో ప్రెట్టీ, సో క్యూట్" అని కామెంట్స్ కొట్టేసుకుంటుందిట.

"ఏరా? ఈ విషయం ఫేస్‌బుక్ ద్వారా చెప్పాలా నువ్వు నీ పెళ్ళానికి?" అంటే, వాడు అప్పుడు నుదురు కొట్టుకుని అసలు విషయం చెప్పాడు.

ఇంకో ఫ్రెండ్ ఫేస్ బుక్‌లో "ఐ లవ్ మై వైఫ్.. ఐశ్వర్యారాయ్ వచ్చినా.. నా వైఫ్ ముందు యాక్. థూ!" అని పెట్టాడు. మేం అంతా వెంటనే స్పందించి "obvuiously ..,very good" అని కామెంట్స్ పెట్టాం.

ఇంకో గంటకే వాడు "ఇందాక ఐశ్వర్యారాయ్ గురించి రాసిన స్టేటస్ నేను ఇచ్చినది కాదు బాబోయ్! నేను నిద్రపోతుంటే నా ఐ ఫోన్ లోంచి నా భార్య చేసిన కుతంత్రం" అని లబలబలాడాడు.

అంతకు ముందు రోజువరకూ కులాసాగా, నవ్వుతూ చలాకీగా ఉండే కుర్రాడు "No meaning in life" అని పెడితే, ఏం మామా బిస్కెట్టా?" అని ఓ వందమంది కుర్రాళ్ళు ఆనందంగా అడుగుతారు - అప్పుడు ఇంట్లో పెద్దాళ్ళకి తెలుస్తుంది వీడి ప్రేమ వ్యవహారం బెడిసి కొట్టి డిప్రెషన్‌లో ఉన్నాడని.

ఇంకా కొంతమంది తమ కవిత్వం వినమంటే పారిపోయే జనం, పద్యాలు చదవుతుంటే తిట్టే జనం ఎక్కడ ఊరికే దొరుకుతారో తెలుసుకున్నట్లు ఈ ఫేస్ బుక్కుల్లో వరుసగా తాము వ్రాసిన కవితలన్నీ ప్రచురించేస్తారు. చాలామంది చదవకుండానే 'లైక్' కొట్టేస్తారు.

"ముందు వెనకా నడుమా మడతపేచీ.. ఇస్తే కొంటె జెల్ల నీతో తూ చీ" అని ఒకడు రాస్తే పాతిక మంది లైకులూ, ఇరవైమంది "గుడ్ వన్.. ఫెంటాస్టిక్" అని కామెంట్లూనూ!

ఇదంతా చాలదన్నట్లు, ఎక్కడెక్కడి నుండో సంపాదించిన వీడియోలూ, యూట్యూబ్ పిక్చర్లూ, దాంతో హౌస్‌వైఫ్స్‌కి పనికాకపోవడాలూ, ఆఫీస్‌లో ఉద్యోగులకి బాస్ నుండి తిట్లూ, మెమోలూ!

ఇవన్నీ చాలవన్నట్లు "మా అబ్బాయికి పంచెలిస్తున్నాం. భోజనాలకి రండి" అనో, "శ్రావణ శుక్రవారం పేరంటానికి రండి" అనో ఓపెన్ ఇన్విటేషన్లు. ఇంటికొచ్చి బొట్టు పెట్టి పిలవడం పోయింది. ఫోన్‌లో చెప్పడమూ పోయింది. ఫేస్‌బుక్ చూసి పొలోమని పోయే రోజొచ్చింది. బానే ఉంది టైం కలిసి వస్తోంది.

కానీ "మా బాస్ ఉట్టి వెధవ" అని రాసిన కామెంట్‌కి ఎవడో లైక్‌లు పెట్టి, కామెంట్ చేస్తే, వాడి ఫేస్‌బుక్‌లోకి వెళ్ళిపోతాం. ఆ ఫేస్‌బుక్‌లో ఆ బాస్ బావమరిది ఉండి, కామెంట్ చేస్తే అతని ఫేస్ బుక్‌లోకి వెళ్ళిపోతాం "ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో అంతే. మీ బాస్ లానే మా బాసు వెధవాయే యజ్ఞనారాయణా పులగం" అని పెడితే, అది ఆ బావమరిది ఫేస్‌బుక్‌లో ఉన్న బాస్ దాకా వెళితే యజ్ఞనారాయణ పులగం పని మర్నాడు ఔట్!

లవ్ ఫెయిల్యూర్ సినిమాలో కూడా పాపం హీరోకి వాళ్ళ నాన్న తన ఫేస్‌బుక్ లోకి వచ్చి తన గర్ల్‌ఫ్రెండ్ ఫోటోలు చూస్తే కష్టాలు వచ్చాయి! అంతే కాదు "నీ ఫేస్ బుక్‌లో అంతమంది అమ్మాయిలు ఉన్నారే? ఆ కాంచన మాల ఎవరూ? నీ చిన్నప్పటి ఫోటోలు అప్‌లోడ్ చేస్తోంది?" అని గర్ల్ ఫ్రెండ్ అనుమానిస్తుంది. "ఆవిడ మా బామ్మ" అంటే "అనుష్కా ఫోటో ఎందుకు ప్రొఫైల్ పిక్చర్‌గా పెడుతుంది మీ బామ్మ?" అంటుంది.

కానీ ఇది నిజంగా జరిగే ఛాన్స్ ఉంది. తాతగార్లూ, బామ్మలూ ఫేస్ బుక్‌లో ఉండకూడదనేం లేదు. నాగార్జున ఫోటో ప్రొఫైల్ పిక్చర్‌గా తాతయ్యా, మల్లికా షెరావత్ ఫోటో బామ్మా పెట్టుకోకూడదనేం లేదు. మొన్న మా ఫ్రెండ్ ఒకత్తి ఫేస్‌బుక్‌లో నాగచైతన్య ఫోటో చూసి ముచ్చట పడి, ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించి, ‘ఒకసారి కలవాలని ఉందని‘ మెసేజ్ పెట్టింది. **ఆ తరువాత అతను ఎవరో కాదు వాళ్ళకి పాలప్యాకెట్లు ఇచ్చే అబ్బాయే అని తెలిసి నిర్ఘాంతపోయింది.**

మొన్న ఓ ఫ్రెండ్ కూతురికి కుదిరి, డేట్ ఫిక్స్ అయిన సంబంధం, అమాంతం కేన్సిల్ అయింది. ఈ అమ్మాయి ఫేస్‌బుక్‌లో అబ్బాయిలు రెచ్చిపోయి, ఫోటోలకి "లవ్ యూ డార్లింగ్. యూ ఆర్ స్టన్నింగ్. చింపేసావు బ్యూటీ" లాంటి కామెంట్సూ, ఆ అమ్మాయి "ఒరేయ్. నీ ఎల్లో టీ షర్ట్ మీద అంటిన నా కాటుక మరక ఇంకా ఉందా?" లాంటి కామెంట్సూ చదివి, అపార్థం చేసుకున్న పెళ్ళికొడుకు ఈ అమ్మాయి నాకొద్దుపొమ్మని నిశ్చితార్థం కేన్సిల్ చేసుకున్నాడంట.

ఇదే రకంగా అబ్బాయిలకీ జరగవచ్చు.

"ఏం ఫోజు కొడుతున్నావురా.. ప్చ్. ప్చ్" అని అమ్మాయిల కామెంట్లు పెడితే అతని ఫియాన్సీకి మండి ఎంగేజ్ మెంట్ రింగ్ వేలి నుండి తీస్తూ, ఫోటో పెట్టి తన స్టేటస్‌లో "లవ్ బ్రేకప్. ఎగైన్ సింగిల్" అని రాసేసినా రాసెయ్యెచ్చు.

ఇది ఫేస్‌బుక్ కాదు చాలాసార్లు "ఫేట్"బుక్‌గా మారి ఫేట్లు మార్చేస్తోంది ఎవడి రాతలు ఎవడు మారుస్తాడో ఎవడికి తెలుసు?

పద్మవ్యూహం సీరియల్‌లో నేను రాసిన ఒక డైలాగ్‌తో ముగిస్తాను.

**రామాయణం రాసింది బోయ!**

**భారతం రాసింది కోయ!**

**ఎవడి రాతలు ఎవడు రాస్తాడో ఎవడికి ఎరుక?**

●●●

**Click here to share your comments on this story.**


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
సాహితి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి